## యువత భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ

**ప్రజాపక్షం/వీపనగండ్లః** మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే సామాజిక శాపం. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి యువతను సరైన మార్గంలో నడిపించాలని వీపనగండ్ల ఎస్ఐ జె.నరేష్, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ అన్నారు. నషా ముక్త్ సప్తాహ వారోత్సవాలు సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల మహమ్మారిపై వ్యాసరచన ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, యువతను సరైన మార్గంలో నడిపించడం , డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావడం అత్యంత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పోచమోని ఆంజనేయులు, పోచమోని మల్లేష్, నాగరాల అంజి, మధుగని కురుమయ్య, తడకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీకి ఎంపికైన యువకుడిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం



**ప్రజాపక్షం/మక్తల్ః** మక్తల్ పట్టణానికి చెందిన ప్యాట శివకుమార్ ఇండియన్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణానికి చెందిన యువకుడు ప్రభుత్వ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగానికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. యువకులు చేదు వ్యసనాలను దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మక్తల్ పేరును సరిహద్దులను తీసుకెళ్లిన శివకుమార్ పట్టణానికి గర్వకారణం అని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, జుట్ల శంకర్ ఈశ్వర్ యాదవ్, రవిశంకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/వంగూరుః** ఈనెల 25న హైదరాబాద్ పట్టణంలోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ఉపసర్పంచ్‌ల ధర్నాను విజయవంతం చేయాలని ఉప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చలో హైదరాబాద్ ఉపసర్పంచ్‌ల ధర్నా గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్ పవర్‌తో పాటు ప్రభుత్వం ఉపసర్పంచులకు గౌరవవేతనం ఇవ్వాలని వారి డిమాండు చేశారు. అనంతరం మండల ఉపసర్పంచుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భాస్కర్ ఉపాధ్యక్షులుగా రజిత మనోహర్ యాదవ్ గౌరవ అధ్యక్షులుగా సత్యం యాదవ్, మరో కొంతమందిని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ

**ప్రజాపక్షం/పానుగల్ః** పానుగల్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం దివ్యాంగులకు స్వయం ఉపాధి పై డా.రెడ్డిస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ ఆనంద్ నాయక్ వివిధ వ్యాపార రంగాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి రూ.25 వేల వరకు ఆర్థికంగా చేయూత నిస్తుందన్నారు. దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈసమావేశంలో టెరిటోరి మేనేజర్ సంతోష్ కుమార్, క్లస్టర్ కోఆర్డినేటర్ మేకల శివ, కోఆర్డినేటర్ భానుకుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జయమ్మ, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆడబిడ్డ' పెళ్లి కానుక అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** ఆడబిడ్డల వివాహాలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ సామాజిక భాధ్యతను చాటుకుంటున్న రాచూర్ సర్పంచ్ గున్నెళ్ల శ్రీనువాస్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు.గ్రామంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడ్డ బిడ్డల పెళ్లిళ్లకు తన వంతు సహకారం అందిస్తూ గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన గంగధారి సంగీత వివాహం సందర్భంగా మంగళవారం సర్పంచ్ గున్నెళ్ల శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆడబిడ్డల పెళ్లిళ్ల కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారుతున్న నేపథ్యంలో తమ వంతు సహాయం అందించడం సంతోషం ఉందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ముఖ్యంగా ఆడబిడ్డల వివాహాల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా అవసరమైన వారికి తన వంతు సహాయం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సర్పంచ్ శ్రీనివాస్ చేస్తున్నా సేవా కార్యక్రమాలు గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ప్రజా సేవలో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ ముందుండి సహాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాధకిషన్‌గౌడ్, కమలయ్య, శ్రావణ్, రామకృష్ణలతో తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల సమస్యలపై మెమోరాండం

**ప్రజాపక్షం/మక్తల్ః** మక్తల్ డా.బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎంఆర్‌సికి వచ్చిన డిఇఒకు మక్తల్ బీసీ కాలనీ , బాబు జగ్జీవన్ రామ్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పృథ్వీరాజ్, మారెప్ప, బాబు జగ్జీవన్ కాలనీ పాఠశాల ఉపాధ్యాయులు అర్కే అశోక్, ఆర్‌టిఐ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి నారాయణ, బుడగ జంగాల హక్కుల నాయకులు రాసూరి భీమేష్, స్కావెంజర్ శంకరమ్మ, జయలక్ష్మి, డా.బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వేణు, తల్వార్ నరేష్, బీసీ కాలనీ బాబు జగ్జీవన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా, డిఏపిపై దృష్టి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ః** ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన విత్తన మేళాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐజ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏడు రకాల వరి వంగడాలను మాత్రమే సాగు చేయాలని సూచించినందున రైతులు మంచి డిమాండ్ ఉన్న వీటినే సాగు చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత తక్కువగా ఉండే గ్రామాల్లో రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు మేరకు కందులు, వేరుశెనగ, కూరగాయలు, తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు నానోయూరియా, డిఏపి వినియోగించేలా డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సాహించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది మొక్కజొన్న పంటను రికార్డు స్థాయిలో పండించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ మండలాల వారీగా యూరియా యాప్‌ను ప్రారభించారు. పలువురు రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కందుల విత్తనాలను పంపిణీ చేశారు. డీలర్లు ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువుల స్టాల్స్‌ను పరిశీలించి నిబంధనల ప్రకారం రైతులకు విక్రయించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ సమీపంలోని జెడ్పిహెచ్ఎస్ ను సందర్శించారు. మన ఊరు మన బడి ద్వారా పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి అడిగారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మోడల్ యునైటెడ్ నేషనల్ ఆర్గనైజేషన్ కార్యక్రమాన్ని ఎంపికైనందున పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఐజ తాహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే సాదా బైనామా, భూభారతి, తదితర దరఖాస్తులను పెండింగులో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట యార్డు చైర్మన్ దొడ్డప్ప, ఐజ పిఎసిఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జ్యోతి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు, ఏఈఓలు, ఇతర అధికారులు, ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పానీయాల నియంత్రణపై కళా ప్రదర్శన



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మంగళవారం ఉదయం నారాయణపేట జూనియర్ కళాశాలలో మత్తు పానీయాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై యాంటీ డ్రగ్స్ అవగాహన కోసం కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పల్లె జానపదాల ద్వారా కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిచారు. తల్లిదండ్రులు మత్తు పానీయాలకు లోనై కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయని, అదే విధంగా నేటి యువత సెల్ ఫోన్ మాయలో పడి చెడు వ్యసనాలకు లోనవుతున్నారని తద్వారా భవిష్యత్తు అంధకారమవుతుందని పాన్, జర్దా, గుట్కా, తంబాకు, నల్ల మందు బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని కళా రూపాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రషీద్, కళాశాల లెక్చరర్స్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రవిశంకర్, కిరణ్, నరసింహ, బాలయ్య, సుగుణ పాల్గొన్నారు.

## బిఎల్ఎలు ఒక్క ఓటూ పోకుండా చూసుకోవాలి



**ప్రజాపక్షం/మక్తల్ః** రాష్ట్ర పాడి, పశుసంవర్ధక, క్రీడా, డెయిరీ, మత్స్యశాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మంగళవారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 24 పోలింగ్ బూత్‌లకు గాను 24 మంది బిఎల్ఎల నియామకాన్ని మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా బిఎల్ఎ లకు 25వ తేదీ నుంచి చేపట్టబోతున్న సర్ ఎన్నికల ఓటు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఓట్లను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఒక్క ఓటు కూడా కోల్పోకుండా జాగ్రత్త పడాలని మంత్రి వాకిటి శ్రీహరి బిఎల్ఎలకు సూచించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని, చాలా జాగ్రత్తగా ఉండి ప్రతి ఓటును కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్ కుమార్ గుప్తా, అమరేందర్‌రెడ్డి, ఏ.రవికుమార్, సాయి ఫైనాన్స్ శ్రీనివాసులు, వల్లంపల్లి లక్ష్మణ్, నారాయణ, నీలప్ప, నీలగౌడ్, మంజూరు ఇలాహి, పెయింటర్ వెంకటేష్, డా.శంకర్, గుంతలి శివకుమార్, మిస్కిన్ నాగరాజు, చందాపూర్ లక్ష్మణ్ , రాములు, శంషుద్దీన్, అశోక్ గౌడ్, కల్లూరి గోవర్ధన్, వాకిటి భాస్కర్, బహదూర్, అబ్దుల్ రెహమాన్, అఫ్రోజ్, రత్నకుమార్, నవీత్ పాషా, నాదర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలలో ఎరువుల సరఫరా



**ప్రజాపక్షం/అమరచింతః** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానాల మేరకు ఇకపై రైతులకు రైతు వేదికలలో విత్తనాలు, ఎరువుల సరఫరాను చేసేందుకు గాను ఏర్పాట్లు జరిగినవన్నీ మండల వ్యవసాయ అధికారి అరవింద్ తెలిపారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని నందిమల్ల, నాగర్‌కడుమూరులలో ఉన్న రైతు వేదికలలో రైతులకు పంటలను సాగు చేసేందుకు గాను సరిపడు విత్తనాలను, ఎరువులను పంపిణీ చేసేందుకు గాను రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధి లోని రైతులందరూ రైతు వేదికల ద్వారా ప్రభుత్వం రైతులకు అవసరమైనటువంటి ఎరువులు విత్తనాలు సరఫరా చేసేందుకు గాను ఏర్పాట్లు జరిగినవని ఇకపై రైతులందరూ ఆ రైతు వేదికలలోనే ఎరువులను కొనుగోలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల సర్పంచు రాజేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు నందకిషోర్ రెడ్డి, చెన్నా రాయుడు, రైతులు పాల్గొన్నారు.

# పేదలు సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలి

కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక



**ప్రజాపక్షం/ మక్తల్ :** పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని 5వ వార్డు బీసీ కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆ కాలనీకి మంజూరైన ఇండ్లలో ప్రస్తుతం ఎన్ని పూర్తికావచ్చాయని హౌసింగ్ పీడీ శంకర్ నాయక్ ను ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 6 ఇండ్లు స్లాబ్ పూర్తి కావచ్చాయని మిగతా ఇండ్ల నిర్మాణాలు బేస్మెంట్ రూఫ్ లెవెల్ లో ఉన్నాయని పిడి కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఆదే కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ లను పరిశీలించారు. ఎల్2 లబ్ధిదారులకు వాటిని కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశాలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహాయం విడతలవారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. అర్హులైనప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో నిర్మాణ పనుల నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. రాజయ్య, ఏఈ పీ. వినయ్ కుమార్, వార్డు అధికారి మహేశ్వరి,మున్సిపల్ సిబ్బంది బాలరాజ్, షరీఫ్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు శారద, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్వి బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/వెల్దండ :** బిఆర్ఎస్వి బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్వి కో ఆర్డినేటర్లు తరుణ్‌నాయక్, బద్దిరాజులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన బిఆర్ఎస్వి ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ యువత విద్యార్థులను బిఆర్ఎస్వి వైపు ఆకర్షించి విస్తరించాల్సిన అవసరం మరింత ఉందని, పార్టీ సిద్ధాంతాలు ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.అదే విధంగా పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ హైజాక్, మాజీ ఎంపీటీసీ చలిచీమల జ్యోతి నిరంజన్, నాయకులు జోగయ్య, నిరంజన్, గుద్దటి ప్రభాకర్ మీసాల రాజు, అంజి మాస్టర్, వెంకటేష్, సక్రునాయక్, డీలర్ వెంకటయ్య, పురుగుల నర్సింహ్మ ముదిరాజు, రమేష్, లాలయ్య పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# షాకాపూర్ రైతు వేదికలో విత్తన మేళా

30 వరకు సన్న రకాల వరి విత్తనాల విక్రయం

రైతులు సద్వినియోగం చేసుకోవాలని

వ్యవసాయ శాఖ పిలుపు




**ప్రజాపక్షం/పెబ్బేరుః** పెబ్బేరు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో షాకాపూర్ రైతు వేదికలో మంగళవారం ప్రత్యేక విత్తన మేళా (సీడ్ మేళా) ప్రారంభమైంది. ఈ మేళా జూన్ 30 వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు షాకాపూర్, సూగుర్ రైతు వేదికలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్న సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా కెయన్‌యం1639, కెఎన్‌యం7715,ఆర్‌యన్‌ఆర్15048, బిపిటి5204 రకాల విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ సన్న రకాల వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి మున్నా, షాకాపూర్ సర్పంచ్ నికిత పాల్గొని మేళాను ప్రారంభించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు చక్రవర్తి, గ్రామ పెద్దలు గోవింద నాయుడు, బాల చందర్ రెడ్డి, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖ సూచించిన సిఫార్సు చేసిన సన్న రకాల వరి విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బోనస్ పథకాల ప్రయోజనాలను పొందాలని రైతులకు వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు.

## ఆసరా పింఛన్ దారులకు బిసి పాయింట్ ఏర్పాటుకు వినతి




**ప్రజాపక్షం/అమరచింతః** ఆసరా పించన్ దారులకు అమరచింతలోని యూనియన్ బ్యాంకులో అదనంగా బీసీ పాయింట్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు యస్.అజయ్ మాట్లాడుతూ అమరచింత లబ్దిదారులకు దాదాపు 2800 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి నెల వందల మంది పెన్షన్లు తీసుకునేందుకు వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళాలు, బీడీ కార్మికులు చేనేత కార్మికులు వివిధ రకాల పెన్షన్ దారులు బ్యాంకులో డబ్బులను డ్రా చేసేందుకు గాను అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. బ్యాంకులో వెళ్లి వోచర్ రాసి లైన్ పద్ధతిలో ఉండటం వల్ల గంటల తరబడి సమయం పడుతుందని, వృద్ధులు, వికలాంగులు వేచి ఉండలేరని కావున అమరచింతలో ఒకే ఒక్క బీసీ పాయింట్ ఏమాత్రం సరిపోదని అదనంగా మరొక బీసీ పాయింట్ (బిజినెస్ కరస్పాండెంట్) ఏర్పాటు చేయాల్సిన అవశ్యకతను తెలుపుతూ యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.గురుకు వినతిపత్రం అందజేయడం జరిగింది. దీనికి స్పందించిన మేనేజర్ జోనల్ అధికారికి రెఫర్ చేసి సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చన్న, జాషువా, నవీన్, వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల 'బిఎల్ఎ' కురుక్షేత్రం

డిసిసి ప్రెసిడెంట్ రాజీవ్ రెడ్డి ' సమతూకం'

సరితమ్మ వర్సెస్ ఎమ్మెల్యే బండ్ల 'కమిటీల' కౌంటర్ వార్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల :** గద్వాల నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఏజెంట్‌ల సమాచారం కోసం సాగుతున్న అంతర్గత యుద్ధం ఇప్పుడు ఊహించని మలుపులు తిరుగుతోంది. నియోజకవర్గంలో అసలైన పట్టు ఎవరిదో తేల్చే ఈ సమాచార వేట కోసం ప్రస్తుత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాంగ్రెస్ నేత సరితమ్మ క్షేత్రస్థాయిలో పోటాపోటీగా ప్రత్యేక కమిటీలను రంగంలోకి దించారు. ఇరువర్గాల మధ్య ' కమిటీల 'కౌంటర్ వార్' నడుస్తుంటే.. జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ రాజీవ్ రెడ్డి నడుపుతున్న 'సమతూకం' రాజకీయం ఇప్పుడు గద్వాల కోటలో పెను సంచలనంగా మారింది. అటు బండ్ల.. ఇటు సరితమ్మ డిసిసి బాస్ రాజీవ్ రెడ్డి ' డబుల్ ఇంపాక్ట్'. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజీవ్ రెడ్డి ఈ సమాచార యుద్ధానికి కేంద్ర బిందువుగా మారారు. నియోజకవర్గ కేడర్‌లో ఇప్పుడు ఆయన అడుగుల పైనే హాట్ హాట్ చర్చ సాగుతోంది. రాజీవ్‌రెడ్డి అటు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితోనూ సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇటు పార్టీలోనే ఉన్న సరితమ్మ గ్రూపుతోనూ టచ్‌లో ఉంటున్నారు. ఆయన రెండు వైపులా సమతూకం పాటిస్తుండటంతో, అస లు బిఎల్ఎల అంతర్గత సమాచారం ఎవరి ఖాతాలోకి వెళ్తుందనే దానిపై తీవ్ర ఉత్కం ఠ నెలకొంది. డిసిసి ప్రెసిడెంట్ స్కెచ్ ఏంటి ? అం టూ అటు ఎమ్మెల్యే వర్గం, ఇటు సరితమ్మ వర్గం లోలోపల మదనపడుతున్నాయి. ఆయన స్టాండ్ ఏంటో స్పష్టంగా తెలియకపోవడంతోనే ఇరుపక్షాలు అప్రమత్తమైనా, సమాచారం చేజారకుం డా పోటాపోటీగా కమిటీలు వేశారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యే బండ్ల 'పక్కా ప్లాన్ ' సిట్టింగ్ ఎమ్మెల్యేగా ప్రతి బూత్ పరిధిలో ఉన్న ఓటర్ల పల్స్, బిఎల్ఎ సమాచారం తన గుప్పిట్లోనే ఉండాలని బండ్ల కృష్ణామోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందుకోసమే అత్యంత సమ్మకస్తులతో కూడిన ప్రత్యేక కమిటీని గ్రౌండ్‌లోకి వదిలారు.

**సరితమ్మ ' కౌంటర్ కమిటీ ' సవాల్ :** ఎమ్మెల్యే కమిటీలకు ఏమాత్రం లొంగేదే లేదంటూ సరితమ్మ సైతం రంగంలోకి దూకారు. ఎమ్మెల్యే వ్యూహాలకు ప్రతివ్యూహంగా సమాంతరంగా తాము కూడా సమాచార సేకరణ కమిటీలను ఏర్పాటు చేసి గ్రౌండ్ లెవెల్ లో మా నెట్‌వర్క్ ఏంటో చూపిస్తాం అంటూ దూకుడు పెంచారు. ఒకవైపు కమిటీలకు కమిటీలతో కౌంటర్.. మరో వైపు మధ్యలో డీసీసీ ప్రెసిడెంట్ నడిపే వ్యూహాత్మక రాజకీయం. గద్వాల పాలిటిక్స్‌ను పీక్స్‌కు చేర్చింది. మంగళవారం గద్వాలలో ఇరుపక్షాలు పోటాపోటీగా కమిటీలు వేయడంతో కే డర్ లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యే అధికారిక బలంతో బండ్ల కమిటీలు దూసుకుపోతుంటే.. సరితమ్మ కమిటీలు చెక్ పెడుతున్నా యి. వీటన్నింటికి నడిబొడ్డున నిలిచిన డీసీసీ ప్రెసిడెంట్ రాజీవ్ రెడ్డి చివరికి ఎవరి కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు? ఈ ' సమాచార యుద్ధం ' లో పైచేయి సాధించి గద్వాల గడ్డ పై అసలైన పట్టు నిరూపించుకునేది ఎవరో తేలాలంటే మరికొద్ది రోజుల ఆగాల్సిందే.

### ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/వంగూర్ః** మండ పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన మాడుగుల జంగమ్మ అనారోగ్యంతో గత వారం రోజుల కింద మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఐదో వార్డ్ మెంబర్ నూకం మంజుల రాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## జాజాపూర్‌లో విత్తన మేళా



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లాలోని రైతు వేదికలలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక తెలిపారు. రైతులు మేళాలో లభించే నాణ్యమైన విత్తనాలను తీసుకోవాలన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను ఆ గ్రామ సర్పంచి సంగీత తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ లో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని అన్ని రైతు వేదికలలో ఇలాంటి విత్తన మేళాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. జిల్లాలో రైతులు ఎక్కువగా వరిని పండిస్తారన్నారు. సీతా ఫలాలు, మామిడి తోటలను సాగు చేసే రైతులు కూడా ఉన్నారని, ఉద్యాన పంటలు కూడా సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అంతర్ పంటలను కూడా ప్రోత్సహిస్తోందని, రైతులు ఆ దిశగా ఆసక్తి కనబరచాలని కోరారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయం చేసుకుని ఆయిల్ ఫామ్ సాగు చేసేలా జిల్లా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం, ఆన్‌లైన్ యాప్ ను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలోని మొత్తం 76 రైతు వేదికలుండగా 60 రైతు వేదికలలో విత్తన మేళాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, తొలిరోజు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలోని రైతు వేదికలలో విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, బుధవారం జిల్లాలోని మిగతా రైతు వేదికలలోనూ విత్తన మేళాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, ఎఒ బాలదినకర్, ఎఇఒలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి : వీర్లపల్లి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గంజాయి, డ్రగ్స్, కల్తీమద్యంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్, ఎంవిఐ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంతం మినీ ఇండియాగా ఏర్పడిందని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రజలు జీవనోపాధి కోసం అక్కడికి వస్తున్నారని, దాంతో గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉంటుందని వివరించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిక కాకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్య వహరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అక్రమ మాదకద్రవ్యాలు, కల్తీమద్యం నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ సమర్థవంతంగా పని చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం

మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వైదేహి నగర్ కాలనీ సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైదేహి నగర్ కాలనీ వాసులు కాలనీల్లో తాగునీరు సరైనా సమయంలో సరఫరా రాకపోవడంతో మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి జలమండలి మేనేజర్ భాను ప్రకాష్‌రెడ్డితో చర్చించి కాలనీ ప్రజలకు మంచినీరు విడుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యను పరిష్కారం చేస్తామని కాలనీ వాసులకు బరోసా కల్పించారు. అదే విధంగా విద్యుత్ శాఖ అధికారులకు వర్షకాలం కావడంతో విద్యుత్ సమస్యలు తల ఎత్తకుండా విద్యుత్ వైర్లపై వేలాడుతున్న కొమ్మలు తొలగించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పి. దామోదర్‌రెడ్డి, జంగారెడ్డి, నరసింహారెడ్డి, రాంచందర్ గౌడ్, శివరాం ప్రసాద్, రామ్మోహన్ చౌదరి, జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెంపు



**ప్రజాపక్షం/యాచారం :** ఇంకుడు గుంతలతో గ్రామాల్లో భూగర్భజలాల పెంపుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని యాచారం మండల అభివృద్ధి అధికారి రాధరాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తులేకుర్థు, తాడిపర్తి, నల్లవెల్లి, కోత్తపల్లి గ్రామాల్లో పర్యటించి ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈసందర్భంగా అమే మాట్లాడుతూ ఇంకుడు గుంతల పనుల్లో వేగం పేంచాలన్నారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల ఎర్పాటుకు అందరు సహకరించాలన్నారు. ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అయా గ్రామాల సర్పంచ్‌లు ప్రత్యేక చోరవ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిఒ శ్రీలత, పంచాయతీ రాజ్ డిఈ శ్రీనివాస్, ఎఈ సూర్యవంశి, సర్పంచ్ రమేష్, తదితరులు పాల్గోన్నారు.

## మియాపూర్‌లో విషాదం

ఫోన్ మాట్లాడుతూ టెర్రస్ నుంచి పడి యువతి మృతి



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి మయూరినగర్‌లోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో ఫోన్ మాట్లాడుతూ టెర్రస్ నుంచి పడి 20 ఏళ్ల యువతి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సంఘటన సంబంధించి స్థానికులు, పోలీసులు కథను ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన బుద్ధ శ్రీ ప్రాణమ్య మృతురాలిగా గుర్తించారు. అమెరికాలో ఉంటున్న తల్లిదండ్రులతో కలిసి ఇటీవల అమ్మమ్మ ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం ఐదో అంతస్తు టెర్రస్‌పై ఫోన్ మాట్లాడుతూ గోడకు ఆనుకొని నిలబడగా అదుపు తప్పి కిందపడింది. వాచ్‌మ్యాన్ సమాచారంతో తల్లి ప్రశాంతి కూతురిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రాణమ్య ఆన్‌లైన్ డిగ్రీ చదువుతోందని, రెండు, మూడు రోజుల్లో వేరే ఫ్లాట్‌కు మారాల్సి ఉందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టెర్రస్ రైలింగ్ ఎత్తు, భద్రతా చర్యలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మర్ బాబర్‌ఖాన్ కోరారు. మంగళవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల రైతు వేధికలో విత్తనమేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విత్తనమేళ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా వ్యవసాయ శాఖ ఏడిఏ రమాదేవి హాజరై రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి వైస్ చైర్మేన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ ఖరీప్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొన్ని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సన్నరకం వరి, జొన్న, పప్పు దినుసులు. నూనె గింజలు, కూరగాయల విత్తనాలను అంధించడం జరుగుతుందని తెలిపారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను అంధించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్, వెల్‌జర్ల సర్పంచ్ బాబునాయక్, కొండన్నగూడ ఉప సర్పంచ్, మార్కెట్ డైరెక్టర్ సురేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.100 మిలియన్లకు పైగా ఎగుమతిలో రంగారెడ్డి జిల్లాకు చోటు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ.100 మిలియన్లకు పైగా ఎగుమతి విలువ కలిగిన 120 జిల్లాలను కేటగిరీఏ జిల్లాలుగా గుర్తించగా, వాటిలో రంగారెడ్డి జిల్లా కూడా చోటు దక్కించుకుంది. జిల్లాలో ఎగుమతుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించడంతో పాటు,ఇప్పటికే వివిధ ఉత్పత్తులను తయారు చేస్తున్న పరిశ్రమలు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన నేపథ్యంలో, డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్ (డిఇహెచ్ ) కార్యక్రమం కింద మంగళవారం సమీకృత మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి)అధికారుల సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ డిజి ఎఫ్‌టి, ఎస్‌ఏ చవాన్, రంగారెడ్డి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.శ్రీలక్ష్మి,కేంద్రం (డిఇహెచ్ ),ఎంఎస్‌ఎంఇ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సుమతి,డిప్యూటీ డైరెక్టర్,కామర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టి. సుదిన్ పాల్,పాల్గొన్నారు. అదేవిధంగా ఎపిఇడిఎ,నాబార్డ్,వాల్‌మార్ట్,ఇపిజిసి, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా,ఇండియా పోస్ట్ తదితర ఎగుమతి ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,దాదాపు 50 సంస్థల ప్రతినిధులు,పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సమావేశంలో అధికారులు ఎగుమతులకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు,ఆర్థిక ప్రోత్సాహకాలు, ఎగుమతి నమోదు ప్రక్రియ,అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు,ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు,డిజిటల్ వాణిజ్య వేదికల వినియోగం, ఈకామర్స్ ద్వారా ఎగుమతుల విస్తరణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అదేవిధంగా,ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న లాజిస్టిక్స్,ధృవీకరణలు,మార్కెటింగ్, ఆర్థిక సహాయం,బీమా, కస్టమ్స్ విధానాలు, విదేశీ మార్కెట్ల ప్రాప్తి వంటి వివిధ సమస్యలపై అధికారులు వివరాలు అందించి,వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో ఫార్మాస్యూటికల్స్,ఐటీ ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తులు,హస్తకళలు,ఇతర తయారీ రంగాల్లో విస్తృత ఎగుమతి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా జిల్లాను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేయడం, సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్‌ఎంఈ) ఎగుమతుల వైపు మళ్లించడం,స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు తీసుకురావడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.జిల్లాలోని పారిశ్రామికవేత్తలు,తయారీదారులు,స్టార్టప్‌లు,ఎంఎస్ ఎంఈ యూనిట్లు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఎగుమతుల రంగంలో ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు.

## వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి సూచన

**ప్రజాపక్షం/కొత్తూరు:** వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి సూచించారు. మంగళవారం సాయంత్రం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని వై జంక్షన్‌ను పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొత్తూరు అండర్‌పాస్‌లో నిలుస్తున్న వర్షపునీరు ప్రాంతాన్ని పరిశీలించారు. అండర్‌పాస్‌లో వర్షపునీరు నిల్వ లేకుండా చూసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై వచ్చే వాహనదారులకు ఇబ్బందులు రాకుండా కృషి చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా షాద్‌నగర్ టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ కొత్తూరు అండర్‌పాస్‌లో ఇప్పటికే 40హెచ్‌పి మోటర్ ద్వారా నీరు తొలగిస్తున్నామని, అదనంగా మరో 20హెచ్‌పి మోటర్‌ను ఏర్పాటు చేసి త్వరగా తొలగించనున్నట్లు వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అండర్‌పాస్‌లో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని వివరించారు. పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి వెంట షాద్‌నగర్ డిసిపి శిరీష, షాద్‌నగర్ ఏసిపి లక్ష్మి నారాయణ, కొత్తూరు సిఐ నర్సయ్య, ట్రాఫిక్ సిఐ శంకరయ్యతో పాటు ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామరావు



**ప్రజాపక్షం/మియాపూర్ :** హామీల అమలు కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామరావు అన్నారు. మియాపూర్‌లో నిర్వహించిన బిఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామరావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలే బిఆర్‌ఎస్‌కు అసలైన బలమని, గులాబీ జెండాను భుజాన మోసిన ప్రతి కార్యకర్త పార్టీ చరిత్రలో హీరో అని ఆయన కొనియాడారు. గత పదేళ్లలో కెసిఆర్. నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9,500 కోట్లకు పైగా అభివృద్ధి జరిగిందని కెటిఆర్ పేర్కొన్నారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, మెరుగైన శాంతిభద్రతలు, సిసి కెమెరాల ఏర్పాటు, తాగునీటి సదుపాయాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మహిళలకు ఆర్థిక సహాయం, ఇతర సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి కంటే కూల్చివేతలకే ప్రాధాన్యత ఇస్తోందని,రాష్ట్ర పరిపాలన సక్రమంగా సాగడం లేదని కెటిఆర్ ఆరోపించారు. అధికారులు ప్రజాసేవ కంటే రాజకీయ ఒత్తిళ్ల మధ్య పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) వంటి కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, తెలంగాణ అభివృద్ధి మళ్లీ వేగం అందుకోవాలంటే కెసి ఆర్ నాయకత్వం అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం బిఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడిపల్లి ఫార్మాసిటీ భూముల్లో విద్యుత్ వైర్ల దొంగలు..

అటోలో తీసుకెళ్తుండగా పట్టుకున్న రైతులు...



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మేడిపల్లి ఫార్మాసిటి వ్యవసాయ పోలాల్లో విత్యుత్ వైర్ల దోగతనం చేస్తుండగా రైతులు పట్టుకోని గ్రీన్ ఫార్మాసిటి పోలిసులకు అప్పగించారు. ఈసంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని వ్యవసాయ పోలాల వద్ద కోందరు వ్యక్తులు సోమవారం రాత్రి వచ్చి స్థంభాలపైకి ఎక్కి విద్యుత్ వైర్లను కట్ చేసి అటోలో తరలిస్తుండగా గ్రామానికి చెందిన యాదగిరి, కోంగళ్ళ శ్రీశైలం పట్టుకోని పోలీసులకు అప్పగించారు. లైన్‌మేన్ సూచన మేరకే విద్యుత్ వైర్లు తీసుకెల్తున్నామని వారు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అటోను స్వాధినం చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా నగదు జమ చేయండి

తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గత రెండు సంవత్సరాలు ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల స్కీమ్‌లో రంగారెడ్డి జిల్లాలో 30 శాతం కూడా పంపిణీ జరగలేదని, కావున 2026–27 సంవత్సర ఉచిత చేప పిల్లల పంపిణీ బదులుగా మత్స్య సోసైటీ అకౌంట్స్‌లో నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,మత్స్యశాఖ జిల్లా అభివృద్ధి అధికారి ఎ వెంకయ్యలకి టిఎంకెఎంకెఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మత్స్యకారులు ఎదుర్కొటున్న వివిధ సమస్యలపై రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షులు తడబోయన కృష్ణ మూర్తి, శంషాబాద్ మండల అధ్యక్షులు కృష్ణమోని రాజేష్ కన్నా,అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి కావాలి రాములుతో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే 2026–27 సంవత్సర ఉచిత చేప పిల్లల స్కీమ్‌లో మత్స్య సోసైటీ అకౌంట్స్‌లో నగదు జామ చేయాలని కోరారు. జిల్లాలో గత 12 సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా చనిపోయిన మత్స్యకారుల ఇన్సూరెన్స్,ఎక్స్ గ్రేషియో పెండింగ్‌లో ఉన్న కేసులకు బడ్జెట్ కేటాయించి ఆ కుటుంబాలను ఆదుకొవాలన్నారు. కోహెడలో నిర్మించే చేపల మార్కెట్ పనులు వెంటనే ప్రారంభించాలని, ఇబ్రహీంపట్నంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వెంటనే పునర్ నిర్మాణం చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని, మత్స్యకార కుటుంబాల జీవిత భద్రతకు ఇన్సూరెన్స్ 20 లక్షలకు పెంచాలని కోరుతు వినతిపత్రంలో పేర్కొన్నారు.



# అంతర్రాష్ట్ర కార్ల దొంగ అరెస్టు

నిందితుడి నుంచి మూడు కార్లు, ఒక బైక్ స్వాధీనం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కార్‌పై మోజుతో ఏకంగా కువైట్‌లో కార్ మెకానిక్‌గా ఎనిమిదేళ్ల పాటు పని నేర్చుకున్న వ్యక్తి, పనిచేయడం కన్న దొంగలించడం సులభంగా ఉంటుందని అనుకున్న వ్యక్తి ఏకంగా కార్లను దొంగలించి పోలీసులకు పట్టుబడిన సంఘటన మంగళవారం వనస్థలిపురం పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం సుష్మా ఎక్స్ రోడ్స్ వద్ద సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్ ప్లేట్ లేని మోటర్ సైకిల్‌పై వెళ్తున్న అతను పోలీసులను చూసి భయాందోళనకు గురై పారిపోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు అతన్ని చుట్టుముట్టి అదుపలోకి తీసుకుని విచారించగా ఈ మధ్య కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా జరిగిన వాహన దొంగతనాలను అతడు నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందిడుతుడు ఇల్లా వెంకటరమణ(37) ఏపిలోని రాజమహేంద్రవరంకు చెందిన వెంకటరమణ కారు మెకానిక్‌గా పని చేసేవేడు కావడంతో అతనికి కారుపై పూర్తి అవగహన ఉండటంతో దొంగలించడం ఈజీగా ఉంటదని అనుకుని ఏకంగా మూడు కార్లు రెండు స్విఫ్ట్ డిజైర్‌లు, ఒక మారుతి ఎర్టిగా, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి ఒక ప్రత్యేక టూల్‌కిట్ బ్యాగ్, ఒక అధునాతన ఇసిఎం, బిసిఎం కిట్లు ఒక గ్లాస్ బ్రేకింగ్ ఐరన్ రాడ్, నాలుగు డూప్లికేట్ కీలు స్వాధీనం చేసుకున్నారు. గతంలో అతనిపై మూడు దొంగతనాల కేసులు వనస్థలిపురంలో ఉన్నాయని, ఒక కేసు ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఉందని నిందిడుతు ఒప్పుకుడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. ఈ కేసుల్లో కృషి చేసిన వనస్థలిపురం సిఐ రవిబాబు, డిఐ బి, రాజేష్ నాయక్, డిఎస్ఐ యుసుఫ్ జాని, ఎల్‌బి నగర్ సిసిఎస్ సిబ్బందికి మల్కాజిగిరి సిపి, ఎల్‌బి నగర్ డిసిపి అనురాధ, వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు.

## అర్హులకు ఓటు హక్కు కల్పించటమే లక్ష్యం:ఆర్‌డిఒ




**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** అర్హులకు ఓటు కల్పించటమే ప్రధాన లక్ష్యమని ఆర్‌డిఓ వై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజక వర్గం ఓటర్లకు సర్‌పై అవగాహన కల్పింటం కోసం ఆర్‌డిఒ కార్యాలయ నుండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చౌరస్తా వరకు 2కె రన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహాసీల్థార్ సునితా, సిఐ మహేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గోన్నారు.

## స్నేహితుడికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చిన్నతూండ్ల గ్రామానికి చెందిన అంకని సంజీవకు ప్రమాదవశాత్తు బ్రేయిన్‌లో బ్లడ్‌ప్లాట్ అయ్యింది, నగరంలోని చింతల కుంటలో ఉన్న నాసా అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు ఈవిషయం తెలుసుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు సంజీవ అరోగ్యం బాగు పడాలని రూ.40,600 రూపాయల అర్థిక సహాయం అందజేసి వారి ఉధార స్వభావాన్ని చాటుకున్నారు.



# పథకాల అమలులో బ్యాంకులు చురుకైన పాత్ర పోషించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా బ్యాంకింగ్ కార్యకలాపాలు,ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు పురోగతిని సమీక్షించేందుకు జిల్లా సంప్రదింపుల కమిటీ (డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ) సమావేశం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అన్ని వాణిజ్య బ్యాంకుల ప్రతినిధులు,వివిధ జిల్లా శాఖల అధికారులు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ), నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ రుణాలు,సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఇ ), విద్యా రుణాల పంపిణీ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.జిల్లాలో రైతులకు, స్వయం ఉపాధి యూనిట్లకు, యువ పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు మరింతగా రుణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా చిన్న వ్యాపార యూనిట్ల అభివృద్ధికి తగిన రుణాలు అందించడం, ఎంఎస్‌ఎంఇ రంగానికి క్రెడిట్ వృద్ధిని వేగవంతం చేయడం, అందుబాటు గృహ రుణాలను ప్రోత్సహించడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయడం పట్ల బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాయోజిత వివిధ పథకాల కింద రుణ ప్రవాహాన్ని పెంచడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అన్ని బ్యాంకులను కోరారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధి, సమగ్ర ఆర్థిక చేర్పు (ఫైనాన్సియల్ ఇంక్లూషన్) సాధనకు బ్యాంకులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని సమావేశంలో కలెక్టర్ పేర్కొన్నారు.రుణాల మంజూరు ప్రక్రియను మరింత సరళీకృతం చేయడం, రుణ పంపిణీలో ఉన్న అవరోధాలను తొలగించడం, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందించే చర్యలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రణాళిక ను ఆవిష్కరించారు. ఈ ప్రణాళికలో ప్రాధాన్య రంగం కోసం రూ. 32,175 కోట్ల రుణ లక్ష్యాన్ని, ప్రాధాన్యేతర రంగం కోసం రూ. 56,144 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లా అభివృద్ధి,ఉపాధి కల్పన, పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ ప్రగతి మరియు సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధనలో బ్యాంకులు ప్రభుత్వ భాగస్వాములుగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

### మాతా,శిశు మరణాల రేటును తగ్గించేందుకు చురుకుగా పనిచేయాలి

మాతా,శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లా ఆరోగ్య సూచికల మెరుగుదలకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్,రంగారెడ్డి జిల్లా ఆరోగ్య సంఘం చైర్మన్ సి.నారాయణ రెడ్డి మంగళవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో జిల్లా ఆరోగ్య సంఘం చైర్మన్ అధ్యక్షులు సి.నారాయణ రెడ్డి అధ్యక్షతన జిల్లా ఆరోగ్య సంఘం సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) పరిధిలో జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ముఖ్యంగా మాతాశిశు ఆరోగ్య సేవలు (ఎంసిహెచ్),గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ,సంస్థాగత ప్రసవాలు,నవజాత శిశువుల ఆరోగ్య సేవలు,టీకా కార్యక్రమాలు, పోషకాహార లోప నివారణ, ఆరోగ్య సూచికల మెరుగుదల వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అధిక ప్రమాద గర్భిణీల(హై రిస్క్ ప్రెగ్నన్సీస్) గుర్తింపును మరింత సమర్థవంతంగా చేపట్టి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని,అవసరమైన వైద్య సేవలు,ప్రత్యేక వైద్య పరీక్షలు, రిఫరల్ సేవలను సకాలంలో అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మాతాశిశు మరణాల రేటును తగ్గించేందుకు ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# మరణించిన భారత నావికులకు ద్రోహం చేసిన మోదీ

ట్రంప్ యుద్ధ నేరంలో మోదీ ప్రమేయం

బాధిత కుటుంబాలకు న్యాయం చేసేదాకా పోరాటం

రైతులు,ప్రజాస్వామ్యసంస్థలకు ఎఐకెఎస్ పిలుపు

**న్యూఢిల్లీ :** ఒమన్ తీరంలో జూన్ 10 తేదీన అమెరికా దాడిలో మరణించిన ముగ్గురు భారతీయ నావికులకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) విమర్శించింది. ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండానే నడి సముద్రంలో ఉన్న నౌకపై అమెరికా సేనలు దురాక్రమణ దాడి చేసి ముగ్గురు భారతీయులను హత్యచేసినాగానీ ప్రధానమంత్రి స్పందించకుండా మౌనం పాటించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఆయన మౌనం ఎంతమాత్రం దౌత్యం కాదని, అది ద్రోహమేనని విమర్శించింది. అమెరికా దాడిలో భారత నావికులు శివానంద్ చౌరాసియాతోపాటు ఆదిత్య శర్మ,పట్నాల సురేష్ మరణించారు. జి–7 సమావేశంలో ట్రంప్‌కు అత్యంత సమీపంలో కూర్చుని ఉండి కూడా ఈ యుద్ధ నేరాన్ని ప్రస్తావించి జవాబుదారీ వహించాలని డిమాండ్ చేస్తూ ఆయనను నిలదీయకపోవడమే కాకుండా, ఆయనతో మోదీ మర్యాదపూర్వక సంభాషణ చేయడం మరణించిన భారత నావికులకు, వారి కుటుంబాలకు ద్రోహం చేయడమేనని ఎఐకెఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. ఈ విధమైన నిర్లక్ష్య పూరితమైన క్రియారాహిత్య ప్రవర్తన ట్రంప్ చేసిన యుద్ధనేరంలో భాగస్వామ్యం పంచుకున్నట్టే కాగలదని విమర్శించింది. భారత నావికుల మృతదేహాలను దేశానికి తీసుకురావడంలో ఎనిమిది రోజులు జాప్యం చేయడంతోపాటు బాధిత కుటుంబాన్ని బిజెపి ముఖ్యమంత్రిగానీ,సంబంధిత మంత్రిగానీ పరామర్శించి ఓదార్చే ప్రయత్నం చేయకపోవడాన్ని ఉద్దేశపూర్వక తప్పిదాలుగా పరిగణించింది. ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావులవెంకయ్య మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, బాధిత కుటుంబాలకు న్యాయం చేసేవరకూ పోరాటం చేస్తామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఈ అన్యాయంపై గళం విప్పి నిరసన ప్రకటించాలని రైతులకు, ప్రజాస్వామ్యసంస్థలకు పిలుపు ఇచ్చారు.

అఖిలభారత కిసాన్ సభ తరపున ఒక ఉన్నత స్థాయి ప్రతినిధిబృందం ఉత్తర ప్రదేశ్ దియోరియా జిల్లా సురౌలీ గ్రామంలో జూన్ 22వ తేదీన పర్యటించి మరణించిన భారత నావికులలో ఒకరైన శివానంద్ చౌరాసియా మృతదేహాన్ని సందర్శించింది. ఆయనకు నివాళులు అర్పించింది. వారి కుటుంబాన్ని ఓదార్చి సంఘీభావం ప్రకటించింది. కుటుంబానికి కిసాన్ సభ తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. రాజన్ క్షీరసాగర్ నాయకత్వాన ప్రతినిధిబృందం సురౌలీ గ్రామాన్ని సందర్శించింది. ఉత్తర ప్రదేశ్ ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్తియాజ్ బేగ్, కోశాధికారి ఛిత్తార్‌సింగ్, ఆనంద్ చౌరాసియాలు ఈ ప్రతినిధిబృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మోదీ ప్రభుత్వ నిర్లక్ష్య పూరితమైన దుశ్చర్యను తీవ్రంగా ఖండించింది. ముగ్గురు భారత పౌరులను అమెరికా సైన్యం హత్య చేసినప్పటికీ ప్రధానమంత్రి ఘర్షణ పడేందుకు తిరస్కరించి మౌనం పాటించడం ద్వారా అమెరికా సామ్రాజ్యవాదంపట్ల మరోసారి దాస్యం ప్రదర్శించారని ప్రతినిధి బృందం విమర్శించింది. మృతదేహాలను దేశానికి తిరిగి తీసుకువచ్చి బాధిత కుటుంబాలకు అప్పగించడానికి ఎనిమిది రోజులు సమయం తీసుకోవడం సిగ్గుచేటైన విషయమని, ఆ కుటుంబాలు తమ ప్రియమైన కుటుంసభ్యుడికోసం అంతకాలం ఎదురుచూడటం జాతికి తలవంపులని విమర్శించింది.

**ముగ్గురు భారత నావికులను అమర–వీరులుగా ప్రభుత్వం ప్రకటించాలి**

ఒమన్ తీరంలో అమెరికా దాడిలో మరణించిన ముగ్గురు నావికులు శివానంద్ చౌరాసియా, ఆదిత్యశర్మ, పట్నాల సురేష్‌లను కేంద్ర ప్రభుత్వం జాతి అమరవీరులుగా అధికారికంగా ప్రకటించాలని అఖిలభారత కిసాన్‌సభ డిమాండ్ చేసింది. ఈ విషయంలో ఎలాంటి జాప్యం చేయకూడదని హెచ్చరించింది. అదేవిధంగా మరణించిన నావికుల కుటుంబాలకు ఐదు కోట్ల రూపాయలు వంతున నష్టపరిహారం చెల్లించాలని, ఈ యుద్ధ నేర చర్య ఘటన విషయాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ వేదిక సహా ప్రపంచ వ్యాప్తంగా అన్ని వేదికలపైనా ప్రస్తావించి న్యాయాన్ని డిమాండ్ చేయాలని కోరింది. ఈ హత్యలకు అమెరికా పూర్తిగా జవాబుదారీ వహించాలని ఐక్యరాజ్యసమితిలో నిలదీయాలని కోరింది. నావికులను హత్యచేసి జవాబుదారీ లేకుండా ప్రవర్తించినందుకుగాను నిరసన తెలియజేస్తూ భారత్–అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలను తక్షణం నిలిపివేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. భారత పౌరుల మృతదేహాలను పణంగా పెట్టి ఇంకెంతమాత్రం ఆ దేశంతో వ్యాపారం చేయకూడదని కోరింది. అదేవిధంగా ఉత్తర ప్రదేశ్ పోలీసులు బాధిత కుటుంబం చేసిన డిమాండ్‌ను పరిశీలించి పరిగణనలోకి తీసుకోకుండా వారి నోరు మూయించేందుకు ప్రయత్నం చేసిందని, వారిని అణచివేసి వేధింపులకు గురిచేసిందని కూడా బాధిత కుటుంబ గ్రామాన్ని సందర్శించిన ఎఐకెఎస్ ప్రతినిధిబృందం విమర్శించింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కనీస సానుభూతి,మర్యాద ఆ కుటుంబం పట్ల ప్రదర్శించకపోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కమంత్రి కూడా వారి ఇంటిని సందర్శించి కుటుంబాన్ని ఓదార్చలేదని, వారికి ధైర్యం చెప్పలేదని, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ స్వగ్రామానికి సురౌలీ గ్రామం అతి సమీపంలోనే ఉంటుందని, కానీ ఆయన వెళ్లలేదని, సంతాపం ప్రకటించలేదని, అమరవీరుడి కుటుంబానికి కనీస మద్దతు ఇవ్వలేదని ఇది సిగ్గుచేటైన తలవంపులు కలిగించే విషయమని తప్పుపట్టింది. ఎంతమాత్రం బాధ్యత లేకుండా ప్రవర్తించిన ప్రభుత్వం అసత్యాలకే ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించింది. ఇంతటి దారుణమైన పరిస్థితుల్లో దేశంలోని రైతులు,ప్రజాస్వామ్య సంస్థలు,భావసారూప్యతగలవారంతా ఈ అన్యాయాన్ని ఖండించాలని, బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని ఎఐకెఎస్ పిలుపు ఇచ్చింది. ప్రజావాణిని ప్రభుత్వం తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అమరవీరులైన నావికులకు న్యాయం చేసేవరకూ అఖిలభారత కిసాన్ సభ విశ్రమించబోదని, పోరాటం కొనసాగిస్తుందని తమ ప్రకటనలో అధ్యక్ష ప్రధాన ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్,రావుల వెంకయ్య కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

# ఆహార ఆవిష్కరణలు వినియోగదారుల అభిరుచుల మేరకే జరగాలి

‘ఫుడ్ ఎ ఫెయిర్ 2026’ పోస్టర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆహార ఆవిష్కరణలు వినియోగదారుల అభిరుచుల మేరకే జరగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలలో పారిశ్రామిక వృద్ధి, వ్యవస్థాపకత, పెట్టుబడులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో (జూలై 2, 3, 4వ తేదీ) మూడు రోజులపాటు జరిగే ‘ఫుడ్ ఎ ఫెయిర్ 2026’ ప్రదర్శన పోస్టర్‌ను డిప్యూటీ సిఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆహార తయారీదారులు, ప్రాసెసర్లు, ఆతిథ్య రంగ నిపుణులు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఇలు, పారిశ్రామిక భాగస్వాములు ఒకచోట చేరి, ఆహార, అనుబంధ రంగాలలోని సరికొత్త ఆవిష్కరణలు, సాంకేతికతలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు శ్రీకాంత్ పూనాటి, కె.కార్తీక్ రెడ్డిలు మాట్లాడుతూ ఉత్తేజకరమైన పాకయాత్ర, ఆహార ఆవిష్కరణ, సుస్థిరత, వృద్ధి ప్రయాణంలో ఈ ‘ఫుడ్ ఎ ఫెయిర్ 2026’ ప్రదర్శనలు వ్యూహాత్మక మైలురాళ్ళుగా నిలుస్తాయన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇద్దరూ డ్రామాలాడుతున్నారు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైల్ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ కలిసి డ్రామాలాడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ఏదో అడిగినట్టుగా, కేంద్రం నుంచి కిషన్ రెడ్డి ఏదో తీసుకొచ్చినట్టుగా ఢిల్లీలో మళ్ళీ నాటకాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో అడ్డగోలుగా విమర్శలు చేసుకుని, ఢిల్లీలో కలిసినట్లు నాటకాలు ఆడుతూ ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఉన్న దగ్గర 250 ఎకరాల భూములను తన సొంత అన్నదమ్ములకు, బావమరిదికి, కుటుంబ సభ్యులకు కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కేవలం మెట్రో దగ్గర ఉన్న రూ 30 వేల కోట్ల విలువైన భూములపైన,ఆ ఆస్తులపైన కన్నేశాని, అందుకే మెట్రో రైల్ ఎల్ అండ్ టి అధికారులను బ్లాక్ మెయిల్ చేసి, వారిని రాష్ట్రం నుంచి పంపించారని ఆరోపించారు. మెట్రో వెనకాల ఒక్క భారీ కుంభకోణం ఉన్నదన్నారు. నిజంగానే కిషన్ రెడ్డికి కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్రం పట్ల చిత్తశుద్ధి ఉంటే, గత ప్రభుత్వం ప్రతిపాదించిన లక్డీకాపూల్ నుంచి మెట్రో పటాన్‌చెర్ లైన్‌కు ఎందుకు కేంద్రంలోని బిజెపి ఆమోదం తెలపలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రాజెక్టు మరోసారి పట్టాలు ఎక్కాలంటే, ఖచ్చితంగా కెసిఆర్ తిరిగి అధికారంలనికి రావాల్సిందేనని అన్నారు.

## ఆలయ పరిపాలనలో దేవాదాయ చట్టం తప్పనిసరి : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ హైదర్‌బస్తీలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సంఘం ఒక ధార్మిక సంస్థేనని, ఆలయ పరిపాలనలో దేవాదాయ చట్టం ప్రకారం నిర్దేశించిన నియమాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఆలయ నిర్వహణలో వాటిని విస్మరించడం దుర్వినియోగంగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆలయ నూతన సముదాయం నిర్మాణంపై తెలంగాణ రాష్ట్రీయ దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నగిళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి, వివాదాస్పద అంశాలపై ఎండోమెంట్స్ చట్టం కింద ఉన్న అధికారులు సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. విగ్రహాన్ని భూతలం నుంచి మొదటి అంతస్తుకు మార్చే ముందు స్థపతి సలహా తీసుకున్నారా, కొత్త ఆలయ ప్రారంభానికి ముందు శాస్త్రోక్త క్రతువులు నిర్వహించారా వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు.

## ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పాదచారుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లను పునరుద్ధరించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని హైకోర్టు పరిసరాల నుంచే ప్రారంభించి నగరమంతా విస్తరింపజేయాలని స్పష్టం చేసింది. సీనియర్ సిటిజన్లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్, గత ఉత్తర్వుల అమలుపై నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

## దత్తత బాలిక సంక్షేమంపై నివేదిక కోరిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ దత్తత వ్యవహారంలో దంపతుల నుంచి స్వాధీనం చేసుకుని సంక్షేమ గృహానికి తరలించిన బాలిక పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని నల్గొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థను హైకోర్టు ఆదేశించింది. శిశు సంరక్షణ గృహంలో ఉన్న ఇతర పిల్లల వివరాలు, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణపై కూడా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. దత్తత వ్యవహారానికి సంబంధించిన రికార్డుల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించిన ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం, 2025లో బాలికను సంరక్షణ కమిటీకి అప్పగించినప్పటి నుంచి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

## హకీంపేట భూముల వేలం నిలిపివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లా షేక్‌పేట్ మండలం హకీంపేటలోని 8.5 ఎకరాల భూముల వేలం ప్రక్రియను హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. భూములపై ఉన్న వివాదాన్ని పరిశీలించేందుకు ఇద్దరు న్యాయవాదులను అడ్వొకేట్ కమిషనర్లుగా నియమిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భూముల హద్దులపై వివాదం తేలకముందే వేలం నిర్వహిస్తే సమస్యలు తలెత్తే అవకాశముందని పిటిషనర్లు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్, జులై 4న క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని కమిషనర్లను ఆదేశించారు. నివేదిక అందే వరకు వేలం ప్రక్రియను వాయిదా వేయాలని హెచ్‌ఎండీఏకు స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్, బిజెపి కలిసి పనిచేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి

కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్, బిజెపి కలిసి పనిచేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం అన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్, హరీష్‌రావు తాము మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని, అయితే అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని మరోసారి దోచుకోవాలనే ఉద్దేశంతోనే అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల అభ్యున్నతికి తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మెట్రో వంటి అభివృద్ధి కార్యక్రమాల పేరుతో భారీ అవినీతి జరిగిందని విమర్శించారు. పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను దోచుకున్నవారే ఇప్పుడు ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు వంటి నాయకులను తెలంగాణ ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని గజ్జెల కాంతం పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని ఆరోపించారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను బెదిరించే ధోరణి మానుకోవాలని హెచ్చరించారు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి తీసుకురావడానికి చేసే ప్రయత్నాలను సహించబోమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించాలని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని సూచించారు.

### ఆర్‌టిసి విలీనం కోసం...

## హనుమంతు ముదిరాజ్ ఆమరణ నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టిసి) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు సంబంధించి అపాయింటెడ్ డేను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టిజెఎంయు) వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ బుధవారం ఉదయం 11 గంటల నుంచి హైదరాబాద్‌లోని బస్ భవన్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామనే హామీని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తు చేశారు. కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని యూనియన్ల అభిప్రాయాలను కోరగా, ఉద్యోగుల విలీనానికే మద్దతుగా యూనియన్లు రాతపూర్వకంగా తెలియజేశాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే విలీనానికి సంబంధించిన అపాయింటెడ్ డేను ప్రకటించి, ఆర్‌టిసి కార్మికుల జీవితాల్లో భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ముందుగా విలీన ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.

## ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కోరిన జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత నాలుగు సంవత్సరాలుగా 14 లక్షల మంది పేద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 8 వేల కోట్ల ఫీజుల బకాయిలను తక్షణమే చెల్లించాలని, గతంలో ఉన్న మాదిరిగానే ఫీజుల రియంబర్స్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జాజుల శ్రీనివాస్ గౌడ్, తాటికొండ విక్రమ్ గౌడ్ సంబంధిత వినతి పత్రాన్ని భట్టి విక్రమార్కకు అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, ఫీజులు చెల్లించాలని ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు వేధిస్తున్నాడంతో అనేక మంది విద్యార్థులు ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. అలాగే 2008 సంవత్సరంలో ప్రారంభమైన ఫీజుల రియంబర్స్‌మెంట్ స్కీమ్‌ను ఏ విధంగా అమలు చేశారో ఇప్పుడు కూడా జిఓ నెంబర్ 8, 9 లను రద్దుచేసి పాత పద్ధతి లోనే ఫీజుల రియంబర్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాలని ఆయన కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పదివేల ర్యాంకు నిబంధనలు ఎత్తివేసి పూర్తి ఫీజులను ప్రభుత్వం భరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలపై త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తాం –డిప్యూటీ సిఎం**

ఫీజుల రియంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, ఫీజుల బకాయిల చెల్లింపుపై రెండు మూడు రోజుల్లోనే బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సానుకూల నిర్ణయం తీసుకుంటామని జాజులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని పున: సమీక్షించడమే లక్ష్యంగా...

## భారత్–అమెరికా ఉన్నత స్థాయి వాణిజ్య చర్చలు షురూ

**న్యూఢిల్లీ :** అమెరికా సుంకాల విధానంలో మార్పుల కారణంగా, ఈ ఏడాది ఆరంభంలో కుదిరిన ఒప్పంద చట్రం తలకిందులైన నేపథ్యంలో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని పునరుద్ధరించి, పున: సమీక్షించే లక్ష్యంతో భారత్–అమెరికాలు మంగళవారం ఉన్నత స్థాయి వాణిజ్య చర్చలు ప్రారంభించాయి. వాణిజ్య భాగస్వాముల నుంచి దిగుమతులపై వాషింగ్టన్ విధించిన తాత్కాలిక సుంకం ఒప్పందం జులై 24న ముగియనున్న నేపథ్యంలో, దీనికి ముందే మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ముగించేందుకు ఇరుపక్షాలు ప్రయత్నిస్తున్న తరుణంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్‌ను కలిశారు. ‘యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్, ఇండియాలో యుఎస్ అంబాసిడర్ సెర్గియో గోర్, వారి ప్రతినిధి బృందానికి డిఓసి_జిఓఐకి సాదర స్వాగతం. (భారత్ & అమెరికా)మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఫలవంతమైన చర్చల కోసం ఎదురు చూస్తున్నాం’ అని పియూష్ గోయల్ తన ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలిపారు. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి కీలకమని ఇరుపక్షాలు భావిస్తున్న వాణిజ్యచర్చలకు కొత్త ఊపునిస్తూ జూన్ 17న ఫ్రాన్స్‌లో జరిగిన జి7 సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏడాదికిపైగా కాలంలో తొలిసారిగా సమావేశమైన కొద్ది రోజులకే గ్రీర్ రెండు రోజుల పర్యటన జరిగింది. ట్రంప్ ప్రకటించిన విస్తృత సుంకాలను కొట్టివేస్తూ, అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో, సుంకాల కట్టుబాట్ల ఆధారంగా ఫిబ్రవరిలో జరిగిన ఒక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం అనిశ్చితంగా మారడంతో ఈ చర్చలు దానివైపు దృష్టి సారించాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయమైన వాణిజ్య భవన్‌లో జరగుతున్న ఈ సమావేశానికి వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్, భారతదేశ ప్రధాన సంధానకర్త దర్పణ్ జైన్ కూడా హాజరవుతున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.ఈనెల ప్రారంభంలో (జూన్ 2–4) న్యూఢిల్లీలో జరిగిన ప్రధాన సంధానకర్తల స్థాయి చర్చల కొనసాగింపుగా ఇది జరిగింది. అమెరికా వాణిజ్య విధానంలో మార్పులు ఒకరకమైన ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చిన తర్వాత ప్రాధాన్యతా సుంకాల విధానాన్ని పొందడం న్యూఢిల్లీకి ఒక ప్రధాన లక్ష్యంగా మారింది.

## భద్రాద్రి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు ఊపిరి

10 రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని కేంద్ర మంత్రి ఆదేశం

రామ్మోహన్ నాయుడుని కలిసిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి మరో సారి ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రతిపాదించిన రెండు స్థలాలు అనుకూలం కాదని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్థలాన్ని గుర్తించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కేంద్ర విమానాయశాఖా మంత్రి కింజరావు రామ్మోహన్ నాయుడిని కలిసి ఎయిల్ పోర్టు నిర్మాణంపై చర్చించారు. కొత్తగా ప్రతిపాదించిన స్థలంపై ఫీజిబిలిటీ అధ్యయనం పూర్తి పదిరోజుల్లో నివేదికలు పంపాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయానికి లక్షలాది మంది భక్తులకు, జిల్లాలోని సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, ఐటిసి పిఎస్‌పిడి వంటి పరిశ్రమలకు విమానాశ్రయం ఏర్పాటుతో పర్యాటక, పారిశ్రామిక, విద్యా రంగాల అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందన్నారు. ఎయిల్ పోర్టుకు అవసరమైన భూ సేకరణ, మౌళిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఇదే సమయంలో వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయానికి జూలైలో శంకుస్థాపన నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహ నాయుడు వెల్లడించారు.



## ఒక పౌరునిడి ఒకే ఓటు ఉండాలి

ఎక్కువ ఓట్లు ఉంటే తొలగించండి

ఎన్నికల కమిషన్‌కు బిఆర్ఎస్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒక పౌరునికి ఒక్క ఓటు ఉండాలన్నదే ‘సర్’ ఉద్దేశమని, కానీ హైదరాబాద్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి నాలుగు,అయిదు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నాయని, వాటిని గుర్తించి, తొలగించాలని బిఆర్ఎస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పదుల సంఖ్యలో ఓట్లు వేశారని, అలాంటివి గుర్తించి తొలగించాలని తెలిపింది. హైదరాబాద్‌లోని బిఆర్‌కెభవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అధికారి సుదర్శన్ రెడ్డిని బిఆర్ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్, మాజీ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్, బిఆర్ఎస్ ప్రధాకార్యదర్శులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, సోమా భరత్‌కుమార్ ,బిసి కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్‌తో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి గ్లోబల్ సిటీలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు నివాసం ఉంటారని, అనేక చోట్ల వారికి ఓట్లు ఉన్నాయని, కానీ ఎన్నికల ప్రక్రియకు ఇది విరుద్ధమనే విషయాన్ని తాము ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై అభ్యంతరాలు తాము కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తామని ఎన్నిక కమిషన్ తెలిపినట్టు వివరించారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఓట్ల వివరాలు తెలిస్తే కచ్చితంగా ఆయా రాష్ట్రాల సిఇఒలతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించిన బిఆర్ఎస్ నాయకులు

ఇప్పుడు రైతుల సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉంది

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతుల సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడమే బిఆర్ఎస్ నాయకుల లక్ష్యంగా మారిందన్నారు. యూరియా వంటి అంశాలపై కూడా ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ అమలు కాలేదంటూ మాజీ మంత్రి హరీష్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కెటిఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యమం పేరుతో ప్రజలను రెచ్చగొట్టిన కారణంగా అమాయకులు నష్టపోయారన్నారు. ఉద్యోగ సంఘాలను కూడా రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలవుతున్నాయని చెప్పారు. అయితే ప్రభుత్వ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీకి సిఎం రేవంత్ రెడ్డి బాహుబలి లాంటి నాయకుడు

టిపిసిసి జనరల్ సెక్రటరీ చెనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాహుబలి లాంటి నాయకుడని, అలాంటి నాయకత్వాన్ని ఎదుర్కొనే స్థాయి కెటిఆర్‌కు లేదని టిపిసిసి జనరల్ సెక్రటరీ చెనగాని దయాకర్ విమర్శించారు. ముఖ్యమంత్రి గురించి మాట్లాడేటప్పుడు కెటిఆర్ భాషను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలన అందిస్తోందని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని కెటిఆర్‌కు సూచించారు. ప్రజలు ఇప్పటికే బిఆర్ఎస్ పాలనను తిరస్కరించారన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కెటిఆర్ తన రాజకీయ భవిష్యత్తు, పదవుల గురించే ఆలోచిస్తున్నారని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకుని, నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని హితవు పలికారు.



## ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

### శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజాపక్షం/బంట్వారం :** ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మంగళవారం అన్నారు. కార్యక్రమంలో భాగంగా బంట్వారం మండల కేంద్రంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు చిల్లా రాంచంద్రయ్య పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పదవీ విరమణ కార్యక్రమానికి వికారాబాద్ స్థానిక శాసనసభ సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. ఆయనను సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు అధ్యక్షులు కడియాల వేణు గోపాల్ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు ఉన్నారు.



## అనురాగ్‌లో ఎఐ జ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కృతిమ మేధస్సు డీప్ లెర్నింగ్ జనరేటివ్ ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించే లక్ష్యంతో అనురాగ్ యూనివర్సిటీలో మూడు రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కృతిమ మేధస్సు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 22నుంచి 24 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మల్లికార్జున రెడ్డి, విక్టర్ డేనియల్ పర్యవేక్షిస్తున్నారు. ప్రారంభ రోజు భరత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ విజయేందర్ బూసి రెడ్డి పాల్గొని ఉపగ్రహ చిత్రాల ఆధారంగా రిమోట్ సెన్సింగ్ రియల్‌టైమ్ వస్తు గుర్తింపులో కృత్రిమ మేధస్సు వినియోగంపై వివరించారు. డీప్ లెర్నింగ్ నమూనాలు విమానాలు నౌకలు వంటి వస్తువులను ఎలా గుర్తిస్తాయో ప్రదర్శిస్తూ ఈ సాంకేతికత రక్షణ సముద్ర భద్రత విపత్తు నిర్వహణ పర్యావరణ పరిశీలనలో కీలకమని తెలిపారు. అలాగే న్యూరల్ నెట్‌వర్క్‌లు ఎడ్జ్ ఏఐ సాంకేతికతలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కృత్రిమ మేధస్సు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ ఫార్మసీ నర్సింగ్ తదితర విభాగాలకు చెందిన సుమారు 130 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. డాక్టర్ విజయేందర్ బూసి రెడ్డి అందించిన సాంకేతిక అవగాహన ప్రత్యక్ష ప్రదర్శనలు సమకాలీన అంశాల వివరణలను అధ్యాపకులు ప్రశంసించారు. డీప్ లెర్నింగ్ ఎడ్జ్ ఏఐ వాస్తవ ప్రపంచ కృత్రిమ మేధస్సు అనువర్తనాలపై తమ అవగాహనను మరింత పెంపొందించుకోవడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. జూన్ 24 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో నిపుణుల ఉపన్యాసాలు ప్రాయోగిక శిక్షణా తరగతులు, ఆధునిక సాంక్షేతిక అంశాలపై చర్చలు నిర్వహిస్తారు.



## జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాలకు గురికాకుండా ఉండేందుకు వాహనదారులు తప్పనిసరిగా తమ ప్రయాణాల్లో హెల్మెట్లను వాడాలని ఉప్పల్ జోన్ డిసిపి కె.సురేష్ కుమార్ సూచించారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో జర్నలిస్టులకు హెల్మెట్లను పంపిణీ చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రజల మేలు కోసమే అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో 30 మంది జర్నలిస్టులకు హెల్మెట్లను అందించామని, త్వరలో జర్నలిస్టులకు బీమా సౌకర్యాన్ని సైతం అందచేస్తామని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి వెంకటరమణ, ఎసిపి వెంకటరెడ్డి, ఉప్పల్ ఇనస్పెక్టర్ రామలింగారెడ్డి, ఎస్సైలు, కళాశాల కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, డైరెక్టర్ బ్రదర్ జాన్ కలిరికల్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి, టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శివాజి, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 25నుంచి ఇంటింటికీ ఓటరు సర్వే

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకియ వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి అర్హుడైనా ఓటరు పేరు జాబితాలో నమోదు కావడంతో పాటు ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. క్రమంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఘట్‌కేసర్‌లో బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూన్ 25 నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ ధ్రువీకరణ ప్రకియను ప్రాంభించాలని ఈ సందర్భంగా సూచించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లో ఏసి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన శిక్షణ శిబిరం ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకియపై అవగాహన కల్పించారు.ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సరిశీలించడం కొత్తగా అర్హత పొందిన వారిని నమోదు చేయడం మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సవరించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి మామిళ్ళ ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్,మాజీ కౌన్సిలర్ కూతడి రవీందర్,మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేష్ ముదిరాజ్ ఉపాధ్యక్షులు కోరుబోతు నాగరాజు, మేకల సునీల్ కుమార్,మైనార్టీ నాయకులు, అధ్యక్షులు, యువజన ఉపాధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత

### ఎంఎంసి పరిధిలో చీరల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మహిళల సంక్షేమానికి, ఆర్థిక సాధికారికతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ అనేక పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంఎంసి మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో పర్యటించిన అనంతరం కుషాయిగూడ లక్ష్మి కన్వెన్షన్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన టీ స్టాళ్లను ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటం ద్వారా వారి ఆర్థిక స్వాలంబన దిశగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పలు ప్రగతి కార్యక్రమాలను తీసుకొని వచ్చారన్నారు. దీనిలోని భాగంగానే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆర్టీసీ లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో అద్దె బస్సు ల నిర్వహణ, సొంత కాళ్లపై బతికేలా వ్యాపారా లు చేసేందుకు రుణసదుపాయాలు, ప్రభుత్వం అమలుపరిచే ఆరు గ్యారంటీల్లో మహిళా సాధికారితకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎంఎంసి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5,62,421 మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డులు పంపిణీ లో, 200 యూనిట్ల విద్యుత్ ఉచిత సరఫరా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వీరిలో 2,53,056 మంది ఎస్‌హెచ్‌జి గ్రూప్‌ల మహిళలు, అలాగే గ్రూపులలో లేని 3,13,539 మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ పరిధిలో 26,601 ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు చెందిన 2,66,010 మహిళలకు గత ఏడాది రూ.576 బ్యాంకు లింకేజి రుణాలు మంజూరు చేయగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.31.53 కోట్ల రుణాలు అందిస్తున్నామన్నారు. ఎంఎంసి పరిధిలోని 7 ఆర్టీసీ డిపోలలో గత మూడేళ్ల కాలంలో 4 కోట్ల 15లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవటం వల్ల ప్రభుత్వం






రూ.10.15 కోట్లు భరించిందన్నారు. రాష్ట్రంలో మహిళల ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో ఉందని, రానున్న కాలంలో మహిళలకు పెద్దపీట వీసే పరంపరను కొనసాగిస్తూనే ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ బోగడపు దయానంద్, ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, తదితర అధికారులతో పాటు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** ప్రభుత్వం ఏర్పాటు చేసిన విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, జిల్లా ఆర్టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం అలియాబాద్, లాల్ గడిమలక్‌పేట రైతు వేదికల్లో విత్తన మేళాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంపిక చేసిన సన్న రకాల విత్తనాలను నాటుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చెప్పారు. సన్న రకాలైన ఆర్‌ఎన్‌ఆర్ 5048, బిపిటి, హెచ్‌ఎంటి, జైశ్రీరామ్, కెఎన్‌ఎం 1638, రకాలు వేసుకోవాలని తెలిపారు. వరి, కూరగాయలు, కందులు విత్తనాలతో పాటు నానో యూరియ, నానోడిఎపిఈ మేళాలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ విత్తన మేళా రైతుల కు జూన్ 30వ తేది వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఎఒ వెంకట్రామ్‌రెడ్డి, డిహెచ్‌ఎస్ఒ శ్రీధర్, ఎల్‌డిఎం శివప్రసాద్, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి, జంగారెడ్డి, ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, సీడ్ కార్పోరేషన్ డిఎం అతుల్‌జైన్, ఎఒ రమేష్, ఎఇఒలు శ్రీనాథ్, సుధీర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ధరఖాస్తులను త్వరితగతంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలంటూ కీసర తహసీల్దార్ యాదగిరిరెడ్డిని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన కీసర తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటి వరకు వచ్చిన ధరఖాస్తుల్లో ఏ మేరకు పరిష్కరించారన్న విషయాన్ని పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటికి కారణాలేమిటని ప్రశ్నించాచు.

## కోతినార్ చెరువు కట్ట తవ్వకాలకు బ్రేక్

- * నిర్మాణ సంస్థపై కేసు నమోదుకు శ్రీకారం చుట్టిన ఎమ్మార్వో ఎన్.రాజేశ్వర్ రెడ్డి
- * ఎమ్మార్వో చర్యలపై గాగిలాపూర్ గ్రామస్తుల హర్షం



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిల్లపూర్ కోతినార్ చెరువు కట్టను ధ్వంసం చేసి కాసా గ్రాండ్ నిర్మాణ సంస్థ నిర్మాణాలకు శ్రీకారం చుట్టడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. నిర్మాణాలు చేపట్టాలంటే రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల నుండి అనుమతులు పొందాలి. ఇవేవీ పట్టని నిర్మాణ సంస్థ ఏకంగా కోతినార్ చెరువు చెరువు కట్ట వద్ద నిర్మాణాలు చేపట్టడం. ప్రజాపక్షం దినపత్రికలో మే19 తారీకున కోతీనార్ చెరువు కట్ట ఆక్రమణపై గ్రామస్తుల ఆందోళన అనే వార్త కథనం రావడంతో దుండిగల్ మండల ఎమ్మా ర్వో ఎన్.రాజేశ్వర్ రెడ్డి నిర్మాణ సంస్థ సమగ్ర విచారణ చేపట్టి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఐరిగేషన్, రెవెన్యూ, సంయుక్తంగా నిర్వహించిన జాయింట్ సర్వేలో కోతినర్ చెరువు కట్టను తొలగించి కాసా గ్రాండ్ బఫర్‌లో నిర్మిస్తున్నట్టు అధికారులు తేల్చారు. గాగిల్లపూర్ కు ప్రధాన జలసాయంతో పాటు అనేకమంది రైతులు కట్టకింద పంటలు పండిస్తూ జీవనోపాధి సాగిస్తుండడం, కట్ట పరిస్థితో ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.



**దుండిగల్ మండల ఎమ్మార్వో ఎన్.రాజేశ్వర్ రెడ్డి వివరణ**

దుండిగల్ పరిధిలోని గాగిల్లపూర్ కోతినార్ చెరువును అనుమతులు లేకుండా కట్టను తవ్విన కాసా గ్రాండ్ ప్రవేట్ నిర్మాణ సంస్థ పైనా కేసు నమో దు చేస్తున్నట్టు దుండిగల్ మండల ఎమ్మార్వో ఎన్.రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణ సంస్థ పై చర్యలు చేపడతామని అన్నారు.



## తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/ఉప్పల్:** మల్లాపూర్ డివిజన్‌లోని గుల్మోహర్ గార్డెన్స్ అనెక్సర్ జి బ్లాక్ నివాసితుల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంగా నూతన తాగు నీటి ప్రాజెక్టు పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, జలమండలి డిజిఎం వేణుగోపాల్‌లు మంగళవారం శంకుస్థాపనలు చేసారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన మీదట తాగునీటి సౌకర్యాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాల పునఃప్రారంభానికి చర్యలు

### ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:**అంతాయిపల్లిలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా ఆర్‌టిఐ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి, మండల విద్యాధికారి కమలాకర్‌లు పాఠశాలను సందర్శించారు. పాఠశాల స్థితిగతులు, భవనం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల నమోదు, అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలను ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కల్గిన ఆహారాన్ని అందిస్తుందన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, మౌలిక సదుపాయలను కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బిట్స్ పిలాని కాలనీలో ఇంటింటికి వెళ్లి బడికి రాని పిల్లలను బడికి పంపించేలా మోటివేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో కత్తి రమేష్, మహేష్, విద్యార్థులు, పాల్గొన్నారు.



**భారత సైన్యంలో అగ్నివీర్‌లో విజయం సాధించిన గోవిందను అభినందించిన జైపాల్‌రెడ్డి**

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజాల్‌కు చెందిన విద్యార్థి జి గోవింద భారత సైన్యంలో అగ్నివీర్ నియామక ప్రక్రియలో విజయం సాదించారు. మంగళవారం జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి జి గోవిందను అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2026 జూన్ 24న మహారాష్ట్ర లోని ఆర్మీ సెంటర్‌కు ఎంపిక కావడం విశేషమని జైపాల్‌రెడ్డి అన్నారు. దేవరయాంజాల్ జిల్లా ఉన్నత పాఠశాలలో పది పూర్తి చేసుకుని ఎన్‌సిసిలో 5వ తెలంగాణ బెటాలియన్‌లో క్యాడెట్‌గా సేవలందించాడు. 2025లో నిర్వహించిన అగ్నివీర్ ఆర్మీ రిక్రుట్‌మెంట్‌లో పాల్గొని అర్హత సాదించి చివరకు భారత సైన్యంలో ఎంపిక కావడం పాఠశాలకే కాకుం డా గ్రామానికి గర్వకారణమన్నారు. యువత దేశ సేవ పట్ల ఆసక్తి చూపాలని సూచించారు.

ఈ విజయానికి అన్ని విధాలుగా సహకరించిన ఫిజికల్ డైరెక్టర్ రాధిక, జిల్లా ఆర్‌టిఐ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డికి గోవింద ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మోటార్ సైకిల్ ఢీకొని ఒకరు మృతి

**ప్రజాపక్షం/కుల్కచర్ల :** పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల గ్రామ శివారులో ఘనాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద స్కూటీ, బైకు ఢీ కొన్నాయి.

ఈ ప్రమాదంలో జూపిటర్ స్కూటీ వాహనాదారు దు కత్రావత్ చంద్ర (65), దీప్లా నాయక్ తండా నివాసి తలకు గాయాలపాలై మృతి చెందాడు. ఫ్యాషన్ ప్రో బైక్‌పై ఉన్నా ప్రయణిస్తున్న గణేష్, కృష్ణ,గాయపడ్డారు.

స్థానికులు 100కు సమాచారం ఇవ్వడంతో కుల్కచర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108లో క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.



## జవహర్‌నగర్ డంపింగ్ యార్డును పూర్తిగా ఎత్తి వేయాలి

### ప్రజాభవన్‌లో వినతిపత్రం అందించిన పోరాట కమిటీ

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డును పూర్తిగా ఎత్తి వేయాలంటూ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ మంగళవారం ప్రజాభవన్‌లో తెలంగాణా ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. జవహర్‌నగర్‌తో పాటు సమీపంలోని అనేక ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అనారోగ్యాలకు దారితీస్తున్న డంపింగ్ యార్డు తొలగించాలంటూ అనేక ఏళ్లుగా పోరాటం చేస్తూ డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిథులు ఉమామహేష్, షేక్షావలిలు ఆయన దృష్టికి తీసుకొనివచ్చారు. ప్రతి రోజు 9600 మెట్రిక్ టన్నుల చెత్త ఇక్కడికి వివిధ ప్రాంతాల నుండి తీసుకొని వచ్చి డంపింగ్ చేస్తున్నారని, చెత్తను క్యాపింగ్ చేసి పర్యావరణ పునరుద్దరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మేకల లలితా యాదవ్, వేణు, కాలేషా, సుబ్రమణ్యం యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.



## రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 9గంటలకు రైతువేదికలో విత్తనమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు ఎఇఒలు ఎఒ, ఎడిఎ వికారాబాద్ జిల్లా వ్యవసాయధికారి రాజారత్నం పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర రైతువేదికల్లో జరుగుతున్న విత్తన మేళాను వీక్షించడం జరిగింది. ప్రధానంగా రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంటల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. జూన్ 23 నుండి జూన్ 30 వరకు రైతు వేదికల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిఎఒతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొని రైతులకు సూచనలు అందించారు. అలాగే నానో డిఎపి, నానో యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎరువుల సమర్థ వినియోగం, ఉత్పాదకత పెంపు వంటి అంశాలపై రైతులకు వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలు నవాబుపేట్, పుల్ మామిడి, ఎల్లకొండ, చించల్‌పేట్, మీనపల్లి కలాన్ రైతు వేదికల్లో నిర్వహించబడనున్నాయి. రైతులు పెద్ద ఎత్తున హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఎంపిడిఓ అనురాధ,వ్యవసాయ అధికారులు, సర్పంచ్‌లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## చదువుకున్న బడికి తన వంతు సాయం

### సొంత ఖర్చుతో పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/నవాబ్ పేట్ :** చిన్నప్పుడు తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఆయన తన వంతు సాయం మంగళవారం అందించారు. నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామానికి చేసిన ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ కావలి నవీన్ కుమార్ యాదవ్, ఎల్లకొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్ తన సొంత డబ్బులతో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను చదువుకున్న గ్రామ పాఠశాల విద్యార్థులకు సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యే జీవితంలో విజయానికి పునాది అని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన సమయంలో నోట్‌బుక్స్ అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నా రు.



## మైనంపల్లిపై బురద జల్లే వారికి బుద్ధి చెబుతాం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిరంతరం ప్రజల మేలు కోసం తపన పడే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై బురద జల్లే వారికి కాంగ్రెస్ పార్టీ తగిన విధంగా బుద్ధి చెబుతుందని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్, క్రిషాంక్‌లు మైనంపల్లిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనంపల్లిని విమర్శించే అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగా ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జితేంద్రనాథ్, పార్టీ నేతలు వెంకటేష్ యాదవ్, బికె శ్రీనివాస్, ఎస్సార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఎరువులు, విత్తనాలు అధికారులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు.వికారాబాద్ పట్టణంలోని యంఆర్‌పి ఫర్టిలైజర్,సేరేష్‌ఏజెన్సీ దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ధరల పట్టిక, నిలువల రిజిస్టర్‌ను పరిశీలించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు విత్తనాలు విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మత్రమే విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గోన్నారు.



